## పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



విద్యార్థులతో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి/బీబీపేట్, నవంబర్ 2 : పాల్వంచ మండలంలోని భవానీపేట తండా గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. బీబీపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మైనార్టీ గురుకుల పాఠశాల పరిశీలన**

కామారెడ్డి, నవంబర్ 2 : పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ శనివారం పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు సంభాషించారు. హాస్టల్‌లో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ కళాశాల తనిఖీ**

నస్రుల్లాబాద్, నవంబర్ 2 : బీర్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా నోడ్ అధికారి షేక్ సలాం శనివారం తనిఖీ చేశారు. కళాశాలలోని రికార్డులను పరిశీలించారు.

## ఉచిత న్యాయవాదులను అందిస్తాం



టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్

కామారెడ్డి, నవంబర్ 2 : కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్, సెక్రటరీ నాగరాణి కామారెడ్డి సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నుంచి ఆర్థిక స్థోమత లేని వారికి ఉచిత న్యాయవాదులను అందిస్తున్నామని తెలిపారు. అండర్ ట్రయల్ ఖైదీల్లో ఆర్థిక స్థోమత లేని వారికి కూడా ఉచిత న్యాయవాది సౌకర్యం కూడా అందిస్తున్నామని అన్నారు. అనంతరం ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లీనిక్, అలాగే 15100 టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు.

# సర్వే కోసం ఎన్యుమరేటర్లను నియమించుకోవాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 2 : ఇంటింటి సర్వే కోసం అవసరమైన ఎన్యుమరేటర్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవోలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా అవసరమైన ఎన్యుమరేటర్లుగా ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీపీవో రాజారాం, జడ్పీ సీఈవో చందర్, డీఈవో రాజు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధైర్యపడొద్దు

### వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ, నవంబర్ 2 : రైతులు అధైర్యపడొద్దని, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలోని తన నివాసంలో శనివారం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, సంబంధిత అధికారులతో చర్చించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బుడ్మి సొసైటీ అధ్యక్షుడు గంగారాం, సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీధర్, వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రైస్‌మిల్లర్లు నాగులగామ వెంకన్న, సంతోష్, ఎల్లారెడ్డి, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

కామారెడ్డి, నవంబర్ 2 : పట్టణంలోని జిల్లా న్యాయస్థానంలో నూతన చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు మారిన చట్టాల్లో ఏ విధంగా సెర్చ్, సీజ్ చేయాలి, అరెస్టుకు సంబంధించిన విధి విధానాలు, ఫొటో, వీడియోలు తీయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీపీ అశోక్, పీపీలు దామోదర్ రెడ్డి, శేషు, పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు జాగ్రత్తలు పాటించాలి

భిక్కనూరు, నవంబర్ 2 : రైతులు తమ పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులు సూచించారు. శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో ఉన్న రైతులకు బావులు, పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమేశ్ బాబు, డీఈలు కళ్యాణ్ చక్రవర్తి, నాగరాజు, ఏడీఏ సుదర్శన్ రెడ్డి, ఏఈ సంకీర్త్, లైన్‌మన్ మాణిక్యం, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మాచారెడ్డి, నవంబర్ 2 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట జడ్పీహెచ్ఎస్‌కు చెందిన మదిరే అశ్విత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామ్‌మనోహర్‌రావు తెలిపారు. అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయిలో ఈ నెల 6 నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సౌజన్య, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

**పరుగు పందెం పోటీలకు..**

బాన్సువాడ రూరల్, నవంబర్ 2 : బాన్సువాడ మండలంలోని కొత్తాబాది ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కడావత్ బిందు రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో జిల్లాస్థాయి పరుగు పందెం 200 మీటర్ల పోటీల్లో గోల్డ్‌మెడల్, 400మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని బిందును అభినందించారు. ఉపాధ్యాయులు హన్మాండ్లు, రాజేశ్వర్, ఆనంద్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శంకర్, విఠల్‌రెడ్డి, పుష్పలత, నజీమాబేగం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రికెట్ పోటీలకు..**

భిక్కనూరు, నవంబర్ 2 : భిక్కనూరులోని చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థిని మహన్విత రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రేణుకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్-19 మహిళా క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌తోపాటు హెడ్ మాస్టర్ అశోక్ యాదవ్ విద్యార్థిని అభినందించారు.

**హాకీ పోటీలకు**

బీబీపేట్, నవంబర్ 2 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన దుంప హాసిని, మద్దూరి మారుతి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

**రగ్బీ పోటీలకు..**

నాగిరెడ్డిపేట, నవంబర్ 2 : మండల కేంద్రంలో గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన కార్తీక్, అంకిత అండర్-14 విభాగంలో రగ్బీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 7న మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

## ఫార్మా కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా



ఫార్మా కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

భిక్కనూరు, నవంబర్ 2 : మండల కేంద్రం శివారులో ఉన్న ప్రముఖ ఫార్మా కంపెనీలో పనిచేసే కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కంపెనీ గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వేతనాలు పెంచాలని, ఓవర్ టైం డ్యూటీకి లెక్క ప్రకారం డబ్బులు ఇవ్వాలని, భోజన సమయాన్ని గంట సేపు కేటాయించాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలి

మాచారెడ్డి, నవంబర్ 2 : జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని, గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## మత్స్య కార్మికులు ఆర్థికంగా ఎదగాలి



చేప పిల్లలను విడుదల చేస్తున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు

బాన్సువాడ రూరల్, నవంబర్ 2 : మత్స్య కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని గంగపుత్రులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు అన్నారు. తాడ్కోల్ గ్రామం లో శనివారం ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గంగపుత్ర సం ఘం పెద్దలు, రాజకీయ నాయకులతో కలిసి ఆయన చెరువులో చేప విత్తనాలను విడుదల చేశారు. తాడ్కోల్ ఊర చెరువులో 50వేలు, తిర్మలాపూర్ చెరువులో 44వేల చేప విత్తనాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి డోలీసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, బుడ్మి సొసైటీ అధ్యక్షుడు గంగుల గంగారాం, వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఖాలేఖ్, రాజు, వెంకట్ రెడ్డి, లక్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి

కామారెడ్డి, నవంబర్ 2 : విద్యార్థులు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖలోని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్‌లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ, టీబీ, రక్తదానంపై జిల్లాస్థాయి రెడ్ రన్ క్విజ్, డ్రామా, రీల్స్ పోటీలను శనివారం నిర్వహించారు. గెలుపొందిన వారికి మొదటి ప్రైజ్ రూ. వెయ్యి, ద్వితీయ స్థానం రూ.750, తృతీయ స్థానం రూ.500 క్యాష్ ప్రైజ్‌ను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధిక, డీపీఎం సుధాకర్, డీపీఏ మహేశ్, సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ అంజయ్య, ప్రభుత్వ డిగ్రీ, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులను వేధించడం ఆపాలి

కామారెడ్డి, నవంబర్ 2 : దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులను వేధించడం వెంటనే ఆపాలని లేబర్ కమిషనర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్నదని అన్నారు. శాంపిల్ పేరుతో తీసుకుంటున్న బీడీని తక్షణమే ఆపేయాలన్నారు. లేదంటే సీఎం క్యాంపు ఆఫీసులో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి సత్యం, నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

## 'అల్ప్రాజోలం అమ్మిన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 2: అక్రమంగా అల్ప్రాజోలం రవాణా చేసి, అమ్మిన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ సింధూశర్మ హెచ్చరించారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని సీఐ కార్యాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించిన ఆమె క్రైం శాతాన్ని తెలుసుకున్నారు. క్రైంరేటు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో లా అండ్ ఆర్డర్ నిర్వహణ ఎలా అమలవుతుందో సీఐని అడిగి తెలుసుకున్నారు. అల్ప్రాజోలం విక్రయించిన వారిపై క్రిమినల్‌కేసులు పెట్టి శిక్ష పడే విధంగా చూడాలన్నారు. కేసులను పెండింగ్‌లో ఉంచకూడదని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఆమెతో పాటు సీఐ రవీందర్ నాయక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

**పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ..**

మద్నూర్, నవంబర్ 2 : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సింధూశర్మ శనివారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. మండలం రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున తనిఖీలు చేయాలని వారికి సూచించారు. మట్కా, పేకాట వంటి వాటి పట్ల కఠినంగా ఉండాలన్నారు. సీఐ నరేశ్, ఎస్సై విజయ్‌కొండ, సిబ్బంది ఉన్నారు.

## బహుజనసమాజ్ పార్టీ సభ్యత్వం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 2: ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం బహుజన సమాజ్ పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని జిల్లా సీనియర్ నాయకుడు హరిలాల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు సాయిబాబా , సిద్దిరాములు, నవీన్, సాయిలు, బాగయ్య తదితరులు ఉన్నారు.

## రేషన్ షాప్ ప్రారంభం

భిక్కనూరు, నవంబర్ 2 : మండల కేంద్రంలో నూతన రేషన్ షాప్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ శనివారం ప్రారంభించారు. లబ్ధిదారులకు సరుకులను సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

భిక్కనూరు, నవంబర్ 2 : రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దని ఎస్సై సాయికుమార్ రైతులకు సూచించారు. ఆయన శనివారం రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టుకోవాలని సూ చించారు. రోడ్లపై ధాన్యం ఆరబెడితే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే తీసేయాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★ Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.

NT-339365-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



భవానీపేటలో తూకం ప్రారంభిస్తున్న ఏపీఎం శ్రీనివాస్



బ్రాహ్మణపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి

రామారెడ్డి, నవంబర్ 2 : సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలో ఉన్న కుప్రియాల్ గ్రామంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి కలిసి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తమకు గోడౌన్ అత్యవసరం ఉందని రైతులు కోరగా, కావాల్సిన భూమిని వెంటనే సీసీఎల్‌తో మాట్లాడి ఇప్పిస్తానని తెలిపారు. గ్రామంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని గ్రామస్తులు కోరగా రోడ్డు విస్తరణ పనులు త్వరలో చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

**భవానీపేట గ్రామంలో..**

లింగంపేట, నవంబర్ 2: మండలంలోని భవానీపేట గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం ధాన్యం తూకం ప్రారంభించినట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామంలోని రైస్‌మిల్‌కు అలాట్‌మెంట్ వచ్చినట్లు తెలిపారు.

**ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి..**

గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. ఆయన వెంట మండల సీపీఎం నాయకులు భాస్కర్, సావిత్రి, రమేశ్, రైతులు ఉన్నారు.

**తాడ్వాయి మండలంలో..**

లింగంపేట(తాడ్వాయి), నవంబర్ 2: తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి, బ్రాహ్మణ్‌పల్లి, నందివాడ గ్రామా ల్లో శనివారం తాడ్వాయి సహకార సంఘం చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం వల్ల మద్దతు ధర పొందవచ్చని, ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు.

## బీబీపేట ఆర్ఐ బదిలీ

బీబీపేట్, నవంబర్ 2 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ అజయ్‌కుమార్ కామారెడ్డి తహసీల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న రాజు ఆర్ఐగా బీబీపేటకు బదిలీపై వచ్చినట్లు ఆర్ఐ అజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

బాన్సువాడ, నవంబర్ 2 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొయ్యగుట్ట శివారులో రెండు పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. 13 మందిని అదుపులోకి తీసుకొని రూ.34 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలు

రామారెడ్డి నవంబర్ 2: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమవుతాయని, పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో అండర్-14 ఏండ్ల బాలికలు మాత్రమే పాల్గొంటారని పేర్కొన్నారు.

## అజ్ఞానాన్ని వదిలి జ్ఞాన దీపాలు వెలిగించాలి



మద్నూర్‌లో వ్యాపారులతో కలిసి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద, నవంబర్ 2 : ప్రతి ఒక్కరూ జీవితంలో అజ్ఞానాన్ని పారదోలి జ్ఞాన దీపాలను వెలిగించినపుడే మనిషి జన్మ సార్థకమవుతుందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. శుక్రవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో పలు వ్యాపార సముదాయాల్లో నిర్వహించిన లక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు వ్యాపారులు శాలువాతో సత్కరించారు.

**లక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..**

మద్నూర్, నవంబర్ 2: దీపావళి సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన లక్ష్మీదేవి పూజల్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. పూజలు చేసిన అనంతరం వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బన్సీపటేల్, మాజీ సర్పంచ్‌లు దరాస్ సురేశ్, గఫార్, నాయకులు ఉన్నారు.

**మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ..**

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన వ్యాపారి కర్క సాయిలు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రధాన ఆయుధం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 2: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు ప్రధాన ఆయుధమని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహుడు గోపాలం విద్యాసాగర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, ఆకుల కిష్టయ్య తదితరులున్నారు.

## అన్యాక్రాంత భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



మంత్రి కొండా సురేఖకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద/నిజాంసాగర్ నవంబర్ 2: దేవాలయ అన్యాక్రాంత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శనివారం దేవాదయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విజ్ఞప్తి చేశారు. దీపావళి పండుగ సందర్భంగా ఆమెను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన దేవాలయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దేవాలయాలకు అప్పగించి ఆ భూముల్లో పామాయిల్ మొక్కల పెంపకాన్ని చేపట్టి దేవాలయాలకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

## క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్సీవో

గాంధారి, నవంబర్ 2: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరకంగా దృఢంగా ఉంటారని మెదక్ రీజియన్ ఆర్సీవో గంగారాం నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రీడలను ఆర్సీవో, స్థానిక ఎస్సై ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించగా, ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్య నాయక్, ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ చంద్ర సెర్వీ, డీఈసీవో శ్యామలత, ఆర్ఎస్ యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి.. అభివృద్ధికి అవరోధం

లింగంపేట, నవంబర్ 2: అవినీతి అభివృద్ధికి అవరోధమని నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్ అన్నారు. లింగంపేట తహసీల్ కార్యాలయంలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐవోబీ బ్యాంకు మేనేజర్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

లింగంపేట, నవంబర్ 2 : మండల కేంద్రంలో మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుర్శెట్టి అశోక్, ఉపాధ్యక్షుడిగా ఆకుల సంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కొడ రవీందర్, సహాయ కార్యదర్శిగా రాజరాం బాలయ్య, కోశాధికారిగా గుజ్జరి మారుతిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఆయా కుల సంఘాల బాధ్యులను ఎన్నుకున్నారు.

## రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

లింగంపేట, నవంబర్ 2: మండలంలోని పోల్కంపేట గ్రామంలో పల్లె దవాఖాన వరకు శనివారం రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలోని పల్లె దవాఖానకు వెళ్లడానికి రహదారి సరిగా లేకపోవడంతో రోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వఖ్, మండల కో-ఆర్డినేటర్ సభ్యుడు మణిగిరి నాగరాజు, అజయ్‌గౌడ్, సాజిద్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, చంద్రయ్య, రాజమౌళి, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

రామారెడ్డి నవంబర్ 2: సదాశివనగర్ మండల కేంద్రంలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయం శక్తితో ఎదగాలని మరిన్ని లాభాలు ఆర్జించే వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుందని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, మండల స్పెషల్ ఆఫీసర్ చందర్‌నాయక్, తహసీల్దార్ గంగాసాగర్, అదనపు డీఆర్డీవో మురళీకృష్ణ, డీపీఎంలు రవీందర్‌రావు, రమేశ్‌బాబు, మండల ఏపీఎం రాజారెడ్డి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రార్థనలతో ఆత్మలకు శాంతి లభిస్తుంది'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 2: ప్రార్థనలతో ఆత్మలకు శాంతి లభిస్తుందని ఎల్లారెడ్డి సెయింట్ ఆండ్రీవ్స్ చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో ఆల్ సోల్స్ డే (సమస్త ఆత్మల దినం) సందర్భంగా చర్చి కాంపౌండ్‌లో ఉన్న పెద్దల సమాధుల వద్ద క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక క్రైస్తవులు సుజిత్, రాజశేఖర్ తదిరులున్నారు.